ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 18 జనవరి 2024



పాఠశాలలకు సంక్రాంతి సెలవుల పొడిగింపు

కలెక్టరేట్/రాజాంరూరల్, జనవరి 17: ప్రభుత్వ పాఠశాలలకు సంక్రాంతి సెలవులను మరో మూడురోజుల పాటు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ - సమగ్రశిక్ష కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం తొలుత గురువారం వరకే సంక్రాంతి సెలవులు ఇచ్చింది. ఈ నెల 19న పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉంది. అయితే, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు ఈ నెల 21 వరకూ సెలవులు పొడిగించింది. 22న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు.

- వారానికి రెండు రోజులే గుడ్డు
- ఒకరోజే చికెన్
- తేల్చి చెబుతున్న హాస్టల్ వార్డెన్లు
- వసతి గృహాల్లో సక్రమంగా అమలు కాని మెనూ
- మెస్ చార్జీలు పెంచని ప్రభుత్వం

ఇంతకంటే పెట్టలేం..



నెల్లిమర్ల మండలంలోని బీసీ బాలుర వసతి గృహం

రాజాం, జనవరి 17

సంక్షేమ వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. వారానికి ఆరు రోజులు బదులు కోడిగుడ్డును రెండు రోజులే పెడుతున్నారు. చికెన్‌ను ఒక రోజుకే పరిమితం చేస్తున్నారు. పైగా కూరలు, ఆహార పదార్థాల్లో నాణ్యత కొరవడుతోంది. ఇదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం అందిస్తున్న మెస్ చార్జీలకు ఇంతకంటే పెట్టలే మని హాస్టల్ వార్డెన్లు తేల్చిచెబుతున్నారు. జిల్లాలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలతో పాటు వెనుకబడిన తరగతులకు సంబంధించి 135 వరకూ హాస్టళ్లు కొనసాగుతున్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 37, గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు 55, వెనుకబడిన తరగతులకు సంబంధించి 43 హాస్టళ్లు నడుస్తున్నాయి. మూడో తరగతి నుంచి పోస్టుమెట్రిక్ వరకూ వేలాది మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రీ మెట్రిక్ హాస్టల్‌కు సంబంధించి మూడో తరగతి వరకూ విద్యార్థులకు రూ.వెయ్యి, 5,6,7 తరగతుల విద్యార్థులకు రూ.1,250, కళాశాల విద్యార్థులకు రూ.1,200, గురుకుల కాలేజీ విద్యార్థులకు రూ.1,400 వరకూ మెస్ చార్జీల రూపంలో చెల్లిస్తున్నారు. కానీ పెరిగిన నిత్యావసరాల ధరలతో పోలిస్తే ఈ చార్జీలు చాలడం లేదని వసతిగృహ అధికారులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు కాస్మెటిక్ చార్జీలు పెంచా లని, సక్రమంగా చెల్లించాలని విద్యార్థులు కోరుతున్నారు. హెయిర్ కటింగ్, నూనె, సబ్బుల కొనుగోలు చేసుకునేందుకు వీలుగా విద్యార్థులకు ప్రభుత్వం కాస్మెటింగ్ చార్జీలను చెల్లిస్తోంది. 3 నుంచి 7 తరగతుల వరకూ రూ.125, 8 నుంచి పదో తరగతి వరకూ రూ.160 చెల్లిస్తున్నారు. కానీ సక్రమంగా చెల్లింపులు చేయడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.


ఓ హాస్టల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం(ఫైల్)

నాలుగేళ్ల కిందట పెంపు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో చివరిసారిగా 2018లో మెస్ చార్జీలను పెంచారు. అప్పట్లో ఉన్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పెంచడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తూ వచ్చారు. కానీ గత ఏడాది కరోనాతో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. 50 నుంచి 100 శాతం పెరగడంతో పాత ధరలకు అనుగుణంగా భోజనం పెట్టడం భారంగా మిగులుతోంది. ప్రభుత్వం చెల్లించే ధరకు.. బయట మార్కెట్‌లో ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో వార్డెన్లకు పాలుపోవడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉన్నతాధికారులు ఎక్కడ బాధ్యులు చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి 2018లో పోల్చితే ధరలు గణనీయంగా పెరిగాయి. అప్పట్లో కందిపప్పు రూ.55 ఉండగా ఇప్పుడు రూ.160కు చేరింది. రూ.69లు ఉండే పామాయిల్ రూ.135, రూ.99 ఉండే చింతపండు రూ.180, రూ.65 ఉండే పెసరపప్పు రూ.125, రూ.120 ఉండే చికెన్ రూ.200, రూ.650 ఉండే గ్యాస్ సిలిండర్ ధర రూ.వెయ్యికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో అప్పటి ధరలకు అనుగుణంగా భోజనం అందించడం సాధ్యమా? అని వార్డెన్లు ప్రశ్నిస్తున్నారు.

వార్డెన్లపై ఒత్తిడి..

వైసీపీ ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో 15 శాతం మెస్ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే పెరిగిన నిత్యావసర ధరలతో పోల్చుకుంటే అవి ఏ మూలకు సరిపోవడం లేదని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారుల ఒత్తిడితో ఆహారం పెడుతున్నారు. కానీ చాలీచాలని ధరల ప్రభావం ఆహార నాణ్యతపై పడుతోంది. దీంతో విద్యార్థుల ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. అందుకే ఈ ఏడాది హాస్టళ్లలో విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

ప్రస్తుత ధరలను దృష్టిలో ఉంచుకొని మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినంత వరకు ఇబ్బందులు తప్పవు. అయినా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. ఈ భారాన్ని వార్డెన్‌లే భరిస్తున్నారు.

-యశోదనరావు, జిల్లా బీసీ సాంఘీక సంక్షేమశాఖ అధికారి, విజయనగరం

ఇసుకపై పెత్తనం

- ట్రెంచ్‌లు కప్పేసి.. నదిని తవ్వేసి దందా
- ఇటు బొడ్డవలస.. అటు గోపాలపురంలో యథేచ్ఛగా తవ్వకాలు
- ప్రమాదంలో రక్షిత బావులు


గోపాలపురం ఆవలి ఒడ్డులో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

రేగిడి, జనవరి 17: బొడ్డవలస రక్షిత బావుల వద్ద ఇసుక దందా ఆగలేదు. ఆగినట్టు నమ్మించారు. మీడియాలో వార్తలు వచ్చినప్పుడు నెమ్మదించడం.. తర్వాత మళ్లీ ఇష్టారాజ్యంగా తోడేయడం అక్కడ సాధారణమై పోయింది. ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతం బొడ్డవలస ఆవల ఒడ్డు మన్యం జిల్లా పాలకొండ మండలం గోపాలపురం గ్రామ పరిధిలో అనధికార తవ్వకాలు మామూలే. అక్కడ అడిగే వారు లేరు. దీనిని చూపి బొడ్డవలస వద్ద దోపిడీకి తెగబడుతున్నారు. ఇక్కడ రాకపోకలను నియంత్రించేందుకు గతంలో తీసిన ట్రెంచ్‌లను కప్పేసి నదిలో లోతుగా తవ్వేస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, నాటుబళ్లతో ఇసుక తరలుతోంది.

బొడ్డవలస వద్ద 7 మండలాలకు వెళ్లే మూడు రక్షిత బావుల చుట్టూ చాలా లోతున ఇసుకను తోడుతున్నారు. నాగావళి నదికి ఇటు బొడ్డవలస, అటు గోపాలపురం ఒడ్డున ఈ దందా నిత్యకృత్యంగా మారింది. నియంత్రించాల్సిన మన్యం జిల్లా యంత్రాంగం స్తబ్దుగా ఉంటోంది. విజయనగరం జిల్లా యంత్రాంగం స్పందించి నియంత్రణకు ట్రెంచ్‌లు కొడుతున్నా అవతలి ఒడ్డు గోపాలపురంలో తాత్కాలికంగానైనా ఆగడం లేదు. ఎక్సకవేటర్లతో రోజుకు లక్షలాది రూపాయల విలువ చేసే ఇసుకను రక్షిత బావుల చెంతనే కొల్లగొడుతున్నారు. నది మధ్యలో రోడ్లు వేసి దందాలకు తెగబడుతున్నారు. బొడ్డవలసలోనూ ఇదే దుస్థితి. ఈరెండు రేవుల్లో తవ్వకాలు జరగడంతో తునివాడ, రేగిడి గ్రామాల్లోనూ ఇటీవల మళ్లీ అక్రమ క్వారీలు తెరుచుకొన్నాయి. రోజుకు లక్షలాది రూపాయల కైంకర్యం జరుగుతోంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

బొడ్డవలస రక్షితబావుల చెంతే తవ్వకాలు, ట్రెంచ్‌లు కప్పేయడం గమనించామని సంకిలి వీఆర్‌ఓ గోపాలరావు చెప్పారు. ఇసుక దోపిడీపై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గోపాలపురం వద్ద తవ్వకాలను అదుపుచేయలేక పోవడంతో బొడ్డవలసలోనూ నియంత్రించలేకపోతున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ట్రెంచ్‌లు కప్పేవారి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకొంటామన్నారు.

'సహకార' ఎన్నికలెప్పుడో?

- నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- నామినేటెడ్ పదవుల్లా మార్చేసిన వైనం
- పాలకవర్గాల పదవీ కాలం పెంపుపై విమర్శలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

కోపరేటివ్ ఎన్నికల నిర్వహణపై వైసీపీ ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. పీఏసీఎస్, డీసీఎంఎస్, డీసీసీబీలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవుల మాదిరిగా పాలక వర్గ పదవీ కాలం గడువు పొడిగిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి సహకార బ్యాంకుల్లో సభ్యులుగా ఉన్న ఓటర్ల ద్వారా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ, అలా చేయకుండా నామినేటెడ్ పదవుల మాదిరిగా గడువును పెంచుతూ వైసీపీ నాయకు లను పదవుల్లో కొనసాగిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లో 2013లో సహకార సంఘాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో మొత్తం 108 సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు చైర్మన్లు ఏర్పాటయ్యారు. తరువాత 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సహకార ఎన్నికలు జరగాల్సి ఉన్నా స్థానిక ఎన్నికలు ముందుండడంతో ఆ జోలికి వెళ్లలేదు. అయితే, స్థానిక ఎన్నికల తరువాత కొత్తగా అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సహకార ఎన్నికలపై పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. నాలుగున్నరేళ్లుగా ఎన్నికలు నిర్వహించ కుండా పాలకవర్గ పదవీ కాలం పెంచుకుంటూ వస్తోంది. ఈ నెలలో పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మరోసారి చైర్మన్‌తో పాటు మొత్తం పాలకవర్గ సభ్యుల పదవీకాలాన్ని ఈ ఏడాది జూలై 17 వరకు పెంచింది. దీంతో చైర్మన్‌గా వేచలపు వెంకట చినరామునాయుడుతో పాటు ఏడుగురు సభ్యులు తమ పదవుల్లో కొనసాగనున్నారు. అయితే పొడిగించిన పదవీ కాలం, లేదా ఎన్నికలు ఏది ముందు వస్తే దాని ఆధారంగా పాలకవర్గ పదవీ కాలం ముగుస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. డీసీఎంఎస్ పాలకవర్గ పదవీ కాలన్నీ పెంచనున్నారు. ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన ప్రభుత్వం పదవీకాలం పెంచడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


జిల్లా కేంద్ర సహకార బ్యాంక్

తిరుగు ప్రయాణం

- స్వగ్రామాల నుంచి వేరే ప్రాంతాలకు బయల్దేరిన జిల్లావాసులు
- కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్

విజయనగరం (ఆంధ్రజ్యోతి) జనవరి 17: సంక్రాంతి కోసం ఎక్కడెక్కడి నుంచో సొంతూళ్లకు వచ్చిన వారంతా పండగ ముగియడంతో తిరిగి ఆ ప్రాంతాలకు తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీంతో బుధవారం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ రద్దీగా కనిపించింది. విజయనగరం నుంచి విశాఖపట్నం, విజయవాడ వరకు వెళ్లే బస్సులు కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సరిగ్గా బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చిన్నారులు, కుటుంబ సభ్యులతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అర కొరగా వచ్చిన బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు పోటీపడ్డారు. మొత్తంగా కిక్కిరిసుకుని, ఫుట్‌పాత్‌లపై నిలబడి గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఇంకొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పలేదు. వలస పక్షలు తిరుగు ప్రయాణమవుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి వివిధ ప్రాంతాలకు అదనంగా ఆర్టీసీ బస్సులు నడపాలని జిల్లావాసులు కోరుతున్నారు.


బస్సుల కోసం నిరీక్షిస్తూ..



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్

సడలని దీక్ష

- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- హామీలు నెరవేర్చాలని డిమాండ్
- మంత్రి బొత్స ఏం చెబుతున్నారో తెలియడం లేదు


కలెక్టరేట్ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి) జనవరి 17

వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని.. తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 37వ రోజుకు చేరుకుంది. వైసీపీ సర్కారు ఒకవైపు ఎస్మా ప్రయోగించినా, షోకాజ్ నోటీసులు ఇస్తున్నా వారు వెనక్కి తగ్గడం లేదు. యథావిధిగా పోరును కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ తీరును ఖండిస్తూ బుధవారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గతంలో తమకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

జగన్ మొండివైఖరి విడనాడాలి

సీఎం జగన్ మొండివైఖరి విడనాడి తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు బి.పైడిరోజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు ప్రభుత్వం ముందుంచిన 11 డిమాండ్లలో 10 డిమాండ్లు నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి బొత్స సత్యనారాయణ మీడియా ముందు చెబుతున్నారని, కానీ ఆయన నెరవేర్చిన డిమాండ్లు ఏంటో తమకు ఇంతవరకు తెలియదని పేర్కొన్నారు. వేతనాలు పెంచమని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చామని మీడియా ముందు మంత్రి బొత్స చెప్పుకొస్తున్నారే తప్ప.. ఏ డిమాండ్లను నెరవేర్చారో ఇప్పటి వరకు ఎవ్వరికీ తెలియదన్నారు. అవేంటో తమకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొత్తవలస జంక్షన్‌లో అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఇంతవరకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని శిబిరం వద్ద ఆందోళన చేయగా బుధవారం కొత్తవలస జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేశారు. శృంగవరపుకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాల సమ్మె కొనసాగుతుంది. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మద్దతు తెలిపారు.


ఎస్.కోటలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కొత్తవలస జంక్షన్‌లో ..

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

విజయనగరం రూరల్: టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం గురువారం జరగనుంది. విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9 గంటలకు కోట జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్యక్రమం జరుగుతుంది. 9.30 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద, 10 గంటలకు కాళ్లనాయుడు మందిరం వద్ద వర్ధంతి కార్యక్రమం జరగనుంది. 10.30 గంటలకు కలెక్టరేట్ వద్ద ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తారు. ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పాల్గొననున్నారు. 13వ డివిజన్ టీడీపీ, కొత్తపేట నందమూరి అభిమాన సంఘం సంయుక్త నిర్వహణలో కొత్తపేట నీళ్ల ట్యాంకు వద్ద ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం జరగనుంది. మరికొన్ని ప్రాంతాల్లోనూ ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించేందుకు స్థానిక టీడీపీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి.

నేడు జీపీడీపీపై శిక్షణ

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో దివంగత మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తి, ఆయన తనయుడు రాంబాబు-గోవిందమ్మ జ్ఞాపకార్థం 150 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి అనూరాధ-పార్థసారథి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. వాసిరెడ్డి కుటుంబానికి చెందిన జగదీశ్, శ్యాంకుమార్, యుగంధర్, కిరణ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కేసు వైసీపీకి అనవసరం

బొబ్బిలి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో సెక్షన్ -17 వర్తించినా, వర్తించకపోయినా వైసీపీకి అనవసరమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన కేసు విషయంలో ప్రభుత్వంపై గాని, సీఐడీ, ఈడీలతీరును గాని సుప్రీంకోర్టు తప్పుపట్టకపోవడం గమనార్హమని అన్నారు.

మోటారు ఏర్పాటు

వేపాడ: మండలంలోని బానాది జగనన్న కాలనీలో తాగునీటి అవసరాలు తీర్చే నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేతి బోరుబావితో కాలనీ వాసుల అవసరాలు తీరడం లేదు. దీంతో గ్రామ సర్పంచ్ యశోద పంచాయతీ నిధుల నుంచి మోటారు కొనుగోలు చేసి బోరుబావిలో అమర్చారు. తద్వారా కాలనీ వాసుల నీటి కష్టాలు తీరనున్నాయని గ్రామస్థులు, జగనన్న కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

కొత్తవలస: తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా గురువారం కొత్తవలసలోని పార్టీ కార్యాలయంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కనకాల శివ తెలిపారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమానికి శృంగవరపుకోట టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి హాజరవుతారని తెలిపారు.

రాజీవ్ క్రీడా మైదానం నుంచి నేడు మారథాన్

కలెక్టరేట్: సామాజిక సంకల్ప మహోత్సవాల్లో భాగంగా గురువారం మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మారథాన్ గురువారం ఉదయం 7.30 గంటలకు రాజీవ్ క్రీడా మైదానంలో మొదలై కోట, సింహాచలం మేడ, గంటస్తంభం మీదుగా రాజీవ్ క్రీడా మైదానం వరకూ కొనసాగుతుందన్నారు.

నేడు నేరెళ్ల పైడిమాంబ తీర్థం

వేపాడ, జనవరి 17: వీలుపర్తి-చెల్దాం గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత నేరెళ్ల పైడిమాంబ తీర్థమహోత్సవం గురువారం వైభవంగా నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ శానాపతి లీల, ఎస్.అప్పా రావు, నిర్వాహక కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.

రేపు దత్తిలో వాలీబాల్ పోటీలు

కొత్తవలస, జనవరి 17 : దత్తి గ్రామంలో ఈ నెల 19న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర వాలీబాల్ రిఫరీ ఎల్‌జీఎన్ కుమార్ తెలిపారు. దత్తి గ్రామదేవత మరిడిమాంబ తీర్థం సందర్భంగా పండు మెమోరియల్, దత్తి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సంకల్ప యాత్రకు విశేష స్పందన

కొత్తవలస, జనవరి 17 : వికసిత భారత్ సంకల్ప యాత్రకు గ్రామాలలో మంచి స్పందన వస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు చొక్కాకుల జగదీశ్వరి, శృంగవరపుకోట నియోజకవర్గ కో కన్వీనర్ సీహెచ్ అప్పారావు అన్నారు. బుధవారం ఉత్తరాపల్లి, చిన్నిపాలెం గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలలో వీరు మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతి ఒక్కరికీ మౌలిక సదుపాయాలను కల్పించడం... అభివృద్ధి చెందిన దేశంగా తయారు చేయడమే ప్రధాని మోదీ ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాపల్లి సచివాలయ కార్యదర్శి కె.వెంకటరావు, చిన్నిపాలెం సర్పంచ్ రంగుడు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

20న అరకులో 'రా.. కదలిరా'



ఎస్.కోటలో మాట్లాడుతున్న నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చౌదరి బాబ్జీ

శృంగవరపుకోట, జనవరి 17: ఈనెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు నిర్వహించనున్న రా..కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలను ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చౌదరి బాబ్జీ కోరారు. బుధవారం స్థానిక టీడీపీ నేత నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న అరకు వ్యాలీలో బహిరంగ సభకు రెండు వేల మంది వచ్చేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యం లో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయు డు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నాయకులు మల్లేశ్వరరావు, కాపుగంటి శ్రీని వాసరావు, చెక్క కిరణ్ కుమార్, భీశెట్టి అరుణ, వాకాడ బాలు, కనిశెట్టి ఈశ్వరరావు, పెదగాడి రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు సరైన వైద్యం లేదు



లలిత కుమారి

శృంగవరపుకోట, జనవరి 17: గిరిజనులకు సరైన వైద్యాన్ని ప్రభుత్వం అందించకపోవడంతో మరణాలు సంభవిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చిట్టంపాడుకు చెందిన గంగులు కుటుంబంలో జరిగిన సంఘటన దారుణమన్నారు. ఇలాంటి దుస్థితి రాకుండా ఉండాలని గతంలో టీడీపీ ప్రభుత్వం ఫీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఈ ప్రభుత్వం వాటిని పక్కన పడేసి గిరిజనుల ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని... చిట్టంపాడుకు రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

ఇదేనా పేదల ప్రభుత్వమంటే?



శ్రీభరత్

శృంగవరపుకోట, జనవరి 17: పేదల ప్రభుత్వమంటే గిరిజనుల చావుకు కారణమవడమేనా అని విశాఖ పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మతుకుమిల్లి శ్రీభరత్ ఓ ప్రకటనలో ప్రశ్నించారు. చిట్టంపాడులో వారం రోజుల వ్యవధిలో బిడ్డ, తల్లి మృత్యువాత పడడంపై బుధవారం స్పందించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఆసుపత్రికి సకాలంలో చేరుకోలేక మృతి చెందారన్నారు. కేవలం ప్రభుత్వ వైఫల్యం వల్లనే ఈ గిరిజనులు చనిపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే డోలీ మోతలకు స్వస్తిపలికేలా అభివృద్ధి చేస్తామని, ఇలాంటి గిరిజనులకు మరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

చిట్టంపాడుకు ఎస్టీ కమిషన్ చైర్మన్

- మందులు లేవని చెబితే ఏం చేయాలి?
- ఎస్టీ కమిషన్ ఎదుట మృతురాలి భర్త గంగులు ఆవేదన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట రూరల్, జనవరి 17: మూలబొడ్డ వర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడులో తల్లీబిడ్డలు రోజుల వ్యవధిలో అనారోగ్యంతో మృతిచెందిన ఘటనపై 'బైక్‌పై తెచ్చి' అన్న వార్తకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు స్పందించారు. ఇందులో భాగంగా బుధవారం కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు.. మృతిచెందిన మహిళ కుటుంబం ఉన్న చిట్టంపాడు గ్రామానికి వెళ్లారు. అక్కడి యువత, మృతురాలి భర్త గంగులుతో మాట్లాడారు. ఈ సందర్భంగా గంగులు మాట్లాడుతూ పది రోజుల క్రితం తన బిడ్డ అనారోగ్యం పాలైతే విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లామని చెప్పాడు. అక్కడ వైద్యం మాత్రమే చేస్తున్నారు తప్ప ఉచితంగా మందులు ఇవ్వలేద న్నాడు. తాము ఎస్టీలమని... తమకు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుంది కదా అని ప్రశ్నిస్తే... 'మందులు ఏమీ ఇవ్వం' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం బాధ కలిగించిందన్నారు. 'మీరు గిరిజనులైతే ఐటీడీఏ నుంచి లేఖ తేవాలని... లేదంటే మందులు బయట కొనుక్కోవాల'ని ఖరాఖండిగా చెప్పారన్నారు. అందుకే భీమిలిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లామని వివరించాడు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గతంలో కొంతమంది వైద్యం అందక చనిపోయారని గిరిజన యువత వివరించారు. సంఘ నాయకుడు గౌరీష్ మాట్లాడుతూ గిరిజనులకు కనీస సౌకర్యాలు లేక దుర్భర జీవితం అనుభవిస్తున్నారని తెలిపారు. పోడు భూములు సాగుచేస్తున్నా పట్టాలు ఇవ్వకపోవడంతో రైతుభరోసా వంటి పథకాలు వర్తించడం లేదని తెలిపారు. వీటిపై స్పం దించిన చైర్మన్ మాట్లాడుతూ'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ముఖ్యమంత్రి నివేదిక కోరారని... అందుకే తానే స్వయంగా వచ్చి కష్టాలు విన్నానని తెలిపారు. వీటిని గురువారం ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో వివరి స్తామని తెలిపారు. అనంతరం మృతిచెందిన గంగమ్మ, ఆమె బిడ్డకు అందించిన వైద్యసేవలు, ఇతర అంశాలపై వైద్యురాలు శిరిషను అడిగి తెలుసుకున్నారు. డీవీజీ వెంట గిరిజన సంఘ నాయకుడు అప్పలరాజు దొర, కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు శిరిష తదితరులు ఉన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో తమ గ్రామానికి ఎస్టీ కమిషన్ చైర్మన్ వచ్చారని... తమ కష్టాలు రాష్ట్ర స్థాయిలో అందరికీ తెలిశాయని గిరిజనుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



మృతిచెందిన గంగమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త గంగులుతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ

తీర్థాలతో ఆధ్యాత్మికత

శృంగవరపుకోట రూరల్, జనవరి 17 : గ్రామాల్లో జరిగే తీర్థాలు ప్రజల్లో ఆధ్యాత్మికత, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. బుధవారం అలుగుబిల్లి గ్రామంలో జరిగిన బాలపేరంటాలు తీర్థంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీటీసీ రాయవరపు చంద్రశేఖర్, సర్పంచ్ బోని ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న గొంప కృష్ణ

ఘనంగా అంకమ్మ తీర్థం

శృంగవరపుకోట రూరల్, జనవరి 17: ధర్మవరం పంచాయతీ బక్కునాయుడుపేటలో బుధవారం అంకమ్మ పేరంటాలు తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పోటీలు అలరించాయి. అమ్మవారికి గ్రామస్థులు పూజలు చేశారు.



పరుగులు తీస్తున్న ఎద్దుల బండి

జీఓ నెంబరు 11 ప్రకారం వేతనాలు చెల్లించాలి

బొబ్బిలి, జనవరి 17: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీవో 11 ప్రకారం జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును బుధవారం శంకరరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు, వారికి చెల్లిస్తున్న వేతనాల వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు. కనీస వేతనం అమలుచేయాలని, ప్రతి నిత్యం ఎదురయ్యే సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.



కమీషనరుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మరో 30 వేల టన్నుల ధాన్యం సేకరిస్తాం

- అధికారులతో మంత్రి బొత్స సమీక్ష

కలెక్టరేట్, జనవరి 17: ప్రస్తుత ఖరీఫ్ సీజనులో జిల్లాలోని రైతులు ఇబ్బందులకు గురికాకుండా పండించిన ధాన్యం విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ధాన్యం సేకరణపై బుధవారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖ ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో ధాన్యం సేకరణ తీరును కలెక్టర్, జేసీలు మంత్రికి వివరించారు. రైస్ మిల్లర్లు తమ సమస్యలను మంత్రికి తెలియజేశారు. వీటిపై సమీక్షించారు. ఏదైనా మండలం నుంచి వచ్చిన ధాన్యం అక్కడి మిల్లులకు కేటాయించగా మిగిలిన తర్వాత ఇతర మండలాలకు తరలించాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత సీజనులో 3.40 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి గాను ఇప్పటి వరకూ 2.67 లక్షల టన్నులు సేకరించినట్టు చెప్పారు. రైతుల ఖాతాల్లో రూ.400 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. రాజాం, ఎస్.కోట నియోజకవర్గాల పరిధిలో సుమారు 50 వేల టన్నులు రావలసి ఉందని చెప్పారు. మరో 30 వేల టన్నుల సేకరణకు అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు మంత్రి చెప్పారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు బడుగు, బలహీన ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, సివిల్ సప్లయిస్ డీఎం మీనాకుమారి, డీఎస్‌వో మధుసూధనరావు, జేడీ రామారావు, డీసీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బొత్స

వైభవంగా గృహలింగేశ్వరస్వామి తీర్థం

లక్కవరపుకోట, జనవరి 17: మండలంలోని కల్లేపల్లి, రేగ గ్రామాల్లో బుధవారం గృహ లింగేశ్వరస్వామివారి తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని 18 గ్రామాల ప్రజలు ఈ తీర్థం ఏటా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గృహ లింగేశ్వర స్వామి తీర్థమహోత్సవానికి విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కొండ గుహలో శివలింగేశ్వరుడు, కొండపైన కోదండరాముడి ఆలయాలు వెలసి భక్తులకు దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాయి. ఉదయం నుంచి శివునికి, కోదండరామునికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాదిమంది ప్రజలు శివుడిని, రాముడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం రేగ గ్రామంలో ఎడ్ల పందాల నిర్వహించారు. ఈ పందాల్లో 9 బండ్లు పాల్గొనగా వల్లంపూడి గ్రామానికి చెందిన ఎడ్లబండి ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది.



గృహలింగేశ్వరస్వామి దర్శనానికి భారీగా వచ్చిన భక్తులు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

విజయగరం (ఆంధ్రజ్యోతి) జనవరి 17: రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేస్తున్న, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం విగ్రహావిష్కరణకు జిల్లా ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం నగరంలోని జడ్పీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ అంబేడ్కర్ స్మృతివనం గొప్ప పర్యాటక కేంద్రంగా రూపొందబోతోందని పేర్కొన్నారు. 2వేల మంది కూర్చునేందుకు వీలుగా ఓపెన్ ఏయిర్ థియేటర్, 10 వేల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజాలంతా పాల్గొనేలా సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి బి. రామానందం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డీఎస్పీ గోవిందరావు, విజిలెన్స్ కమిటీ సభ్యుడు బి. భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం నగరానికి చేరుకున్న రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్ జడ్పీ అతిథి గృహంలో కలిశారు. జిల్లాలో ఎస్సీల రక్షణ , వారి సంక్షేమానికి సంబంధించి తీసుకుంటున్న చర్యలపై వారు చర్చించారు. ఎస్సీలు సమస్యలు విన్నవించుకోవాటానికి అధికారుల వద్దకు వచ్చినప్పుడు సావధానంగా వినాలని ఆయన సూచించారు. పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఇందిర(ఫైల్)

కొత్తవలస, జనవరి 17: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంలోని ఘోషాసుత్రిలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న ఇందిర (60) స్థానిక కొత్తవలస- విజయనగరం రోడ్డు లోని పీఎంఎల్ కాంప్లెక్స్ సమీపంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఎప్ప టిలాగే బుధవారం సాయంత్రం విశాఖపట్టణం నుంచి ఇంటికి భర్తతో కలిసి స్కూటీపై వస్తోంది. మండలంలోని విశాఖపట్టణం-అరుకు రహదారిలో దేశపాత్రునిపాలెం కాటా వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు స్కూటీని ఢీకొనడంతో స్కూటీపై కూర్చున్న ఇందిర కిందపడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఇందిరపై నుంచి వెళ్లిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనలో భర్తకు గాయాలేవీ తగలలేదు. దీనిపై పోలసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16 మంది జూదరుల అరెస్టు

బొబ్బిలి, జనవరి 17: పట్టణ పరిధిలోని కంచరవీధి శివాలయంలో బుధవారం రాత్రి పేకాట ఆడుతుండగా 16 మంది పట్టుబడినట్లు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. తమకు అందిన సమాచారంతో ఎస్ఐ జి.లోవరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడులు చేశారన్నారు. పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 2,14,540 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

రాజాం రూరల్: ఆటో ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతకవిటి మండలం పుల్లిట గ్రామానికి చెందిన రామస్వామి (41) రేగిడి మండలంలోని ఓ ప్రయివేటు కర్మాగారంలో పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం రామస్వామి బైక్‌పై విధులకు వెళ్తున్న సమయంలో మండల పరిధిలోని గురవాం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. స్థానికులు తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని పట్టణంలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో తమకు న్యాయం జరిగేంత వరకూ మృతదేహాన్ని హాస్పిటల్ నుంచి తరలించేది లేదని మృతుడి కుటుంబీకులు హాస్పిటల్ వద్ద ఆందోళన చేపట్టారు. మృతుడి భార్య సుందరమ్మ ఫిర్యాదు మేరకు రాజాం టౌన్ సి.ఐ. కె.రవికుమార్ కేసు నమోదు చేశారు.

పండగతో కదలని లారీలు

- రూ.1.60 కోట్ల నష్టం



సాలూరులో నిలిచిపోయిన లారీలు

సాలూరు రూరల్, జనవరి 17: సంక్రాంతి పండగ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా సాలూ రులో లారీలు కదలలేదు. ఎక్కడివ క్కడే నిలిచిపో యాయి. పట్టణంలో రెండు వేలు పైబడిన లారీ లు ఉండగా, పెద్ద పండగ నేపథ్యంలో వాటిని నిలిపివేశారు. దీంతో ఒక్కో లారీకి సగటున రోజుకు రూ. 2వేల చొప్పున ఆదాయం కోల్పోయామని లారీ యజమానులు అంటున్నారు. ఈ లెక్కన రెండు వేల లారీలకు నాలుగు రోజులకు కలిపి రూ.1.60 కోట్లు ఆదాయం కోల్పోయినట్టేనని అభిప్రాయప డుతున్నారు. గురువారం నుంచి యథావిధిగా లారీల రాకపోకలు కొనసాగనున్నాయని వారు తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ దర్యాప్తు



దర్యాపు చేస్తున్న డీఎస్పీ

వంగర, జనవరి 17: లక్ష్మీంపేటలో మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య జరిగిన చిన్న వివాదం చినికి చినికి గాలివానగా మారింది. లక్ష్మీంపేటకు చెందిన పొట్నూరు రామినాయుడు తమ కారులో మద్దివలస వెళుతుండగా.... అదే గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ సితారాంపురం నుంచి లక్ష్మీంపేటకు మోటారు సైకిల్ పై వస్తున్నాడు. గ్రామ సమీపాన ఉన్న ఎత్తు కానా దగ్గరకు వచ్చేసరికి కారు, మెటారు సైకిల్ ఢీకొన్నాయి. దీంతో ఇరువురి మధ్య గొడవ మొదలైనట్టు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఒకరిపై ఇంకొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ విషయాన్ని చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తికి తెలియజేశారు. దీంతో బుధవారం రాజాం సీఐ శ్రీనివాసరావు, డీఎస్పీలు గ్రామంలో ఉన్న పోలీసు పికెట్ వద్ద ఇరుపార్టీలతో చర్చించారు. వివాదానికి కారణాలు తెలుసుకున్నారు. ఇద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రింగురోడ్డు : విజయనగరం ఆర్టీసీ డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులు సమస్యలపై 99592 25620 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

బాల కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రింగురోడ్డు: ప్రాథమిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలకేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ సూపరింటెండెంట్ బొర్రా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహరాజా సంస్కృత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న బాల కేంద్రంలో శాస్త్రీయ గాత్ర సంగీతం, భరతనాట్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఏడాదికి రూ.50 ఫీజు చెల్లించి విద్యార్థులు బాల కేంద్రంలో చేరవచ్చునని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఎంఆర్ స్టేడియం రోడ్డులో ఉన్న మహారాజా ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలకు ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6.30 గంటల మధ్య సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94415 72195 నెంబరును సంప్రదించాలని సూచించారు.

గిరిజన సమస్యల పరిష్కారంలో విఫలం

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన నాయకుడు గురాన అయ్యలు ఆరోపించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శృంగవరపు కోట మండలం చిట్టింపాడుకు చెందిన గిరిజనుడు గంగులు ఎదుర్కొన్న హృదయవిదారక ఘటన తీవ్రంగా కలచి వేసిందన్నారు.

అపూర్వ కలయిక



సీతారాంపురం పాఠశాలలో పూర్వ విద్యార్థులు

వంగర, జనవరి 17: మండలంలోని ఎం.సీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాలలో మొక్కలు నాటడంతో పాటు ఏటా టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందిస్తామని తీర్మానించారు. సమావేశమైన వారిలో బెల్లాన చంద్రమౌళి, ఓట్నూర మహేష్, సాదెం రమేష్, రామారావు, గౌరు తదితరులు పాల్గొన్నారు.

అభియోగం కొండంత.. రికవరీ గోరంత

- సోషల్ ఆడిట్ లెక్కలపై అనుమానాలు
- రికవరీ, అపరాధ రుసుం కలిపి చూపించింది కేవలం రూ.15,800

రేగిడి: మండలంలో సోషల్ ఆడిట్‌లో తేల్చిన అభియోగాలు, చూపిన రికవరీపై బోలెడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. 2022-23 ఏడాదిలో ఉపాధి, పంచాయితీరాజ్, సమగ్రశిక్ష, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 1778 పనులకు రూ.19.83 కోట్లు ఖర్చు చేశారు. ఇటీవల మండలంలో ఎస్ఆర్‌పీ మాధవరావు ఆధ్వర్యంలో ఆడిట్ బృందం ఆడిట్ నిర్వహించి.. దాదాపు రూ.40 లక్షల వరకు అభ్యంతరాలు, అభియోగాలు లేవనెత్తారు. ఈ మేరకు ఎస్ఆర్‌పీ ధ్రువీకరించారు. ఇందులో అధికారు బృందం అనేక కుస్తీల తరువాత లెక్కలు వేసి తేల్చిన రికవరీ, అదీ సిబ్బంది పై అపరాధ రుసుంతో కలిపి రూ.15,800గా నిర్ధారించారు. దీనిపై కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందన్నది స్థానికుల అభిప్రాయం. చూపించిన అభియోగాలు రూ.లక్షల్లో ఉండగా... రికవరీ రూ.వేలల్లో చూపించడం గమనార్హం.

అభియోగాలు ఇవే..

రికవరీ లెక్కలు తేల్చని రెండు, మూడు పంచాయతీల విషయాన్ని ఎస్ఆర్‌పీ మాధవరావు తెలిపారు. రెండు పంచాయితీల్లో సిమెంట్ పక్కదారి, మరో పంచాయితీలో కాంక్రీట్ పనుల్లో లెక్కల తేడాపై చర్చ జరిగినా సర్దుబాటు చేయడంతో రికవరీలో చూపించలేదన్నది సోషల్ ఆడిట్ చెబుతున్న మాట. ఖండ్యాంలో 74 బస్తాల విలువ రూ.18,796, సరసనాపల్లిలో పక్కదారి పట్టిన 524 బస్తాల విలువ రూ. 1.52 లక్షలు. వెంకమ్మపేటలో పనులు చేయకుండా రూ.65,880 బిల్లులు చెల్లించినట్లు సోషల్‌ఆడిట్ బృందం అభ్యంతరం లెవనెత్తారు. దీనిపై ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన పీడీ లక్ష్మణరావు సిబ్బందిని వెనకేసుకొచ్చి సోషల్ ఆడిట్ సిబ్బందిని తప్పుపట్టి మేనేజ్ చేశారన్నది సోషల్ ఆడిట్ బృందం అభిప్రాయం.



రేగిడిలో సామాజిక ప్రజావేదికలో అభియోగాలపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న దృశ్యం (ఫైల్)

లోతైన విచారణ జరిగితే లక్షల్లో రికవరీ

సోషల్ ఆడిట్‌లో రికవరీ అతి తక్కువగా చూపించటంపై ఎస్ఆర్‌పీ మాధవరావు వివరణ ఇచ్చారు. ఆడిట్‌లో దాదాపు రూ.40 లక్షలు అభియోగాలు బయటపడినట్టు వెల్లడించారు. కొలతల తేడా, చేయని పనులకు బిల్లులపై లోతైన విచారణ జరిగితే అసలు రికవరీ తేలే అవకాశం ఉందన్నారు. కొన్ని గ్రామసభల్లో సర్దుబాటు చేసినా... ఆధారాలు లేనివి బోలెడు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాలపై పీడీకి నివేదించి.. వాస్తవ పరిస్థితిని తెలియజేస్తానన్నారు.

ఎస్మాను ఉపసంహరించుకోవాలి



కురుపాం: అంగన్‌వాడీ సిబ్బందికి భోజనాలు వడ్డిస్తున్న రంజిత్‌కుమార్



గజపతినగరం: గంగిరెద్దుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు

● వినూత్నంగా కొనసాగుతున్న నిరసనలు ● 37వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

సిబ్బందిపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాను ఇప్పటికైనా ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్‌చేసింది. ఈ మేరకు బుధవారం సమ్మె 37వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వినూత్నంగా నిరసనలు కొనసాగించారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

●**గజపతినగరం:** సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు వి.లక్ష్మి తెలిపారు. గజపతినగరంలో గంగిరెద్దుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మెచేసే హక్కు రాజ్యాంగం కల్పించందని, ఆ హక్కును కాలరాసేలా ప్రభుత్వం యత్నించడం తగదన్నారు.ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాషిణి, రాముడమ్మ, నాగమణి, జ్యోతి, రాముడమ్మ పాల్గొన్నారు. ● **బాడంగి:** బాడంగిలో టీడీపీ నాయకుడు గుణుపూరు స్వామినాయుడుఆధ్వర్యంలో సంతకాలు సేకరిం చారు.● **శృంగవరపుకోట:** ఎస్.కోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల నిరసనతెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లాకార్యదర్శి మద్దిల రమణ ప్రభుత్వం వ్యవహ రిస్తు న్న తీరును విమర్శించారు. ● **కురుపాం:** కురుపాంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఆకలితో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోలా రంజిత్‌కుమార్, కలిశెట్టికొండయ్య ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటుచేశారు.



బాడంగి: సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

టీడీపీలో 50 కుటుంబాల చేరిక



శత్రుచర్ల సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని తుంబలి పంచాయతీ గంగంపేట, చినతుంబలి గ్రామాల నుంచి వైసీపీకి చెందిన సుమారు 50 కుటుంబాలు బుధవారం మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు పల్ల రాంబాబు, మాజీ సర్పంచ్ పూడి సీతారాంనాయుడుతో పాటు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అరకులో టీడీపీ సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వరితో పాటు జిల్లా నాయకులు

గుమ్మలక్ష్మీపురం:అరకులో బుధవారం జరిగిన సమావేశంలో రానున్న ఎన్నికల్లోటీడీపీ విజయానికిప్రణాళికలు, భవిష్యత్‌కార్యాచరణపై చర్చించారు.కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు బోనెల విజయచంద్ర, జగదీశ్వరి పాల్గొన్నారు.

షర్మిల రాకతో పార్టీ బలోపేతం

●మన్యం జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తినమోహన్

పాలకొండ: షర్మిల రాకతో పార్టీ బలోపేతమవుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు బత్తినమోహన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యమన్నారు. అనంతరం స్థానిక మార్కెట్ జంక్షన్‌లో కేక్‌కట్‌చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నోకాల రాము, విజయచంద్, రత్నాలమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై దృష్టి సారించాలి

●గరుగుబిల్లి ఎంపీడీవో పైడితల్లి, ఈవోపీఆర్‌డీ గోపాలరావు



గరుగుబిల్లి: కార్యదర్శులకు ప్రణాళికలపై అవగాహనకల్పిస్తున్న అధికారులు

గరుగుబిల్లి : పంచాయతీల పరిధిలో అభివృద్ధి ప్రణాళికలపై దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. బుధవారం గరుగుబిల్లి మండలాభివృద్ధి కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో సమస్యలను గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పనకే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సమస్యలను గుర్తించిన తర్వాత గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కార్యదర్శులు వ్యవహరించాలని తెలిపారు. నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీల పరిధిలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలను సిద్ధంచేయాలి

గజపతినగరం:గ్రామాభివృద్ధికి ప్రణాళికలను సిద్ధంచేయాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అధికారులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుదర్శనం పాల్గొన్నారు.

జగన్నాథ పరిక్రమ ప్రాజెక్టు ప్రారంభం



సర్వాంగసుందరంగా ముస్తాబైన జగన్నాథ మందిరం

ఒడిశా

రాయగడ: పూరీశ్రీక్షేత్రంలో జగన్నాథాలయ పరిక్రమ ప్రాజెక్టు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభించారు. మందిర నిర్వాహక కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆలయ ఆచార, సంప్రదాయాలతో స్వాగతంపలికారు. రాష్ట్రంలోని అన్ని జగన్నాథాలయాల్లో ఈకార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాయగడలోని జగన్నాథ మందిరాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు జగన్నాథ, బలభద్ర,సుభద్ర దేవతామూర్తులను దర్శిం చుకున్నారు. పూరీలో జరిగిన కార్యక్రమాన్ని భక్తులు తిలకించేందుకు పత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటుచేశారు.

21 కిలోల గంజాయి స్వాధీనం



సర్వాంగ సుందరంగా ముస్తాబైన జగన్నాథ మందిరం

రాయగడ: బిసంకటక్ సమితి చాటికోన రైల్వేస్టేషన్ సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్‌చేశారు.బిసంకటక్ పోలీసుల కథనం మేరకు.. రెండు ప్లాస్టిక్ సంచుల్లో ఇద్దరు వ్యక్తులు గంజాయిని రవాణా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో బిసంకటక్ థానా ఎస్ఐ ప్రసన్నకుమార్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలుచేశారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌జిల్లా బడగాం పోలీసుస్టేషన్ పరిధిలోగల సిరిసాలి గ్రామానికి చెందిన బురహన్ అహ్మద్, పశ్చిమ బెంగాళ్‌లోని మురిసిబాద్ జిల్లా హరపుర గ్రామానికి చెందిన మహమ్మద్ రబాగాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 21 కిలోల గంజాయి, రూ.1,790, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించారు.

సాగునీరు విడుదల చేయాలి

● అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

గరుగుబిల్లి: తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువల నుంచి రబీకి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని అరకు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం చిలకాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన కాలువల నుంచి గత ఏడాది నవంబరులో సాగునీరు విడుదల నిలిపివేశారని చెప్పారు. కాలువలు ఆధునీకరణ పనులు నెపంతో విడుదలలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలువల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసినా, వైసీపీ ప్రభుత్వ హయాంలో తోటపల్లి ప్రాజెక్టును పట్టించుకోని పరిస్థితి నెలకొందని చెప్పారు. నాలుగేళ్లకుపైగా ప్రాజెక్టు పరిధిలోని రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. గత ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో సాగునీరందక రైతులు నష్టపోయారని తెలిపారు. నష్టాలను పూడ్చేందుకు రబీలో ఆరుతడి పంటలకు నీటిని విడుదలచేయడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. రైతులు సాగునీరు విడుదలచేస్తారని రైతులు సిద్ధమయ్యారని, సంబంధిత అధికారులు దృష్టి సారించి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీప్రతినిధులు బొంగు నారాయణస్వామి, కండేన బలరాంనాయుడు, పల్ల మోహనరావు, అక్కేన నారాయణరావు పాల్గొన్నారు.

పథకాల మంజూరులో వివక్ష

● దళిత నాయకులు టొంపల నర్సయ్య, కనిగిరి శ్రీనివాసరావు



విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

నెల్లిమర్ల: సంక్షేమ పథకాలు మంజూరులో దళితులపై అధికారులు వివక్ష చూపుతున్నారని దళిత నాయకులు టొంపల నర్సయ్య, కనిగిరి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం విజయనగరంలోని జిల్లా పరిషత్ అతిథి గృహంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను నెల్లిమర్ల మండలానికి చెందిన దళిత నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూములకు సంబంధించి యాజమాన్య హక్కులు కల్పించేందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దళితులపై దాడులు పెరిగిపోవడం తదితర అంశాలపై లిఖిత పూర్వకంగా వినతిప త్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో జన్ భగీదారి: జేసీ

పార్వతీపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం జన్ భగీదారి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు పార్వతీపురంలోని సెయింట్ పీటర్స్ పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు మారథాన్ నిర్వహిస్తామని, అనంతరం మానవహారం ఉంటుందని చెప్పారు. రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఛాయా చిత్ర ప్రదర్శన, సిగ్నేచర్ క్యాంపెయిన్, సభ వంటివి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు కిరణ్‌కుమార్,రామచంద్రరావు, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, డీపీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శంబరలో జాతర సందడి



మక్కువ : అమ్మవారికి అలంకరించేందుకు సిద్ధం చేస్తున్న వెండి కవచం

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు భక్తుల రద్దీ ప్రారంభమయ్యింది. రెండు రోజులుగా భక్తులు ఉదయం నుంచి అమ్మ వారి దర్శనానికి తరలివస్తున్నారు. అమ్మవారికి చీరెలు, పసుపు, కుంకుమ సమర్పించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. సంక్రాంతికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అమ్మవారిని దర్శించి కుని స్వస్థలాలకు వెళ్తారు. ఇక్కడ ఈనెల 22, 23, 24 తేదీల్లో ప్రధాన జాతర జరగనుంది.దీంతో శంబరలో జాతర సందడి మొదలైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ప్రతిఏటా అమ్మవారి జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగు తోంది. దీంతో ఈ సారి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలమాంబకు వెండి కవచం

శంబర పోలమాంబకు పెందుర్తికి చెందిన సాయికిరణ్, రమ్యకీర్తి దంపతులు రూ.1,60,000ల విలువ గల కేజీ 600 గ్రాముల వెండి కవచం బహూకరించారు.ఈ మేరకు బుధవారం వెండి ఆభరణాన్ని మంగళ వాయిద్యాలతో చదురు గుడికి తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, ఆలయ మాజీ ఛైర్మన్ పూడి దాలినాయుడు, పి.సన్యాసినాయుడు, గంజి బుచ్చినాయుడు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

సాలూరు రూరల్:సాలూరులో పట్టణ ఎస్ఐ కేవీ సురేష్ మహంతివీధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో తొమ్మిది మంది జూదరులను అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్న విషయంపై సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేశారు. ఈ మేరకు తొమ్మిది మందిని అరెస్టుచేసి రూ. 1,79,510తో అరెస్ట్ చేశారు. వారంతా 52 పేక ముక్కలతో కోత ఆట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొటారుబిల్లిలో కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం

●అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు ●భారీగా బందోబస్తు

గంట్యాడ: కొటారుబిల్లిలో కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం బుధవారం సందడిగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం ముడు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ భక్తులు చీరెలు, కోళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా కనుమ మరుసటిరోజున కనక దుర్గమ్మ తీర్థ మహోత్సవం నిర్వహిస్తారు. అమ్మవారిని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు కేఏ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, జడ్పీటీసీ వర్రినర్సింహమూర్తి, ఏఎంసీ ఛైర్మన్ వేమలి ముత్యాలునాయుడు,ఎస్సీ సెల్ ఛైర్మన్ పీరుబండి జైహింద్ కుమార్‌తోపాటు వైసీపీ, టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గంట్యాడ ఎస్ఐ సుదర్శననాయుడు, విజయనగరం రూరల్ ఎస్ఐ వాసుదేవరావు ఆధ్వర్యంలోని బందోబస్తు నిర్వహించారు.



తీర్థమహోత్సవంలో భక్తుల కోలాహలం

304 గ్రాముల బంగారం చోరీ

కేసును ఛేదించిన మండపేట రూరల్ పోలీసులు

మండపేట: 304 గ్రాముల బంగారు చోరీ కేసును మండపేట పోలీసులు పది రోజుల్లో ఛేదించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చెందిన గాధంశెట్టి రామచంద్రమూర్తికి చెందిన బంగారం దుకాణంలో ఈనెల6న చోరీ జరిగింది. ఈకేసును పోలీసులు పది రోజుల్లో ఛేదించారు. కేసు వివరాలను రామచంద్రపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం వెల్లడించారు. ఈఘటనలో 304గ్రాముల బంగారం వస్తువులు ఒక వ్యక్తి అపహరించాడు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా షామీర్‌పేట మండలం మాలకోపేటలో ఆనందనగర్‌కాలనీకి చెందిన 25ఏళ్ల గొట్టపు లోకేశ్ తాపి పనిచేస్తుంటాడు. ప్రస్తుతం అతడు పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రాయిపురం గ్రామంలో ఉంటున్నాడు. అయితే అతడు ద్వారపూడిలో తాపిమేస్త్రిగా కొంత కాలం నుంచి పనిచేస్తున్నాడు. ఈనెల ఆరో తేదీ రాత్రి ద్వారపూడికి చెందిన గాధంశెట్టి రామచంద్రమూర్తికి చెందిన బంగారం దుకాణం గోడకు కన్నం పెట్టి రూ.9 లక్షల విలువైన బంగారు వస్తువులను లోకేశ్ అపహరించాడు. దుకాణం యజమాని ఫిర్యాదుతో మండపేట రూరల్ ఎస్ఐ బి.ఎస్.కృష్ణ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలతో రూరల్ సీఐ కొమ్ముల శ్రీధర్‌కుమార్ విచారణ చేపట్టారు. ఈనెల16న ద్వారపూడి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న పాతమద్యం దుకాణం వద్ద నిందితుడు లోకేశ్‌ను పోలీసులు పట్టుకుని విచారించారు. నేరాన్ని అతడు అంగీకరించాడు. మొత్తం బంగారాన్ని రైల్లో తీసుకువెళ్లే పోలీసులు పట్టుకుంటారని, ద్వారపూడి ఓవర్ బ్రిడ్జి పిల్లర్ వద్ద కొంత బంగారాన్ని పాతి పెట్టినట్టు చెప్పాడు. కొంత బంగారాన్ని విశాఖపట్నంలో విక్రయించినట్టు అతడు చెప్పాడు. పాతిపెట్టిన రూ.7.20లక్షల విలువైన 240 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. పది రోజుల్లో కేసును ఛేదించిన మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, మండపేట రూరల్ పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. నిందితుడిని రాజమహేంద్రవరం కోర్టులో బుధవారం హాజరుపర్చినట్టు డీఎస్పీ తెలిపారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

రాజాం రూరల్: తన కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఈనెల ఆరో తేదీన శ్రీకాకుళం వెళ్తానని చెప్పి ఇప్పటివరకూ ఇంటికి రాలేదని మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన రాయి సూరీడమ్మ బుధవారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న తన కుమారుడు శ్రీకాకుళం వెళ్తానని చెప్పాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రాజాం టౌన్ సీఐ రవికుమార్ కేసు నమోదు చేయగా ఎస్ఐ రవికిరణ్ దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

●పాత జ్ఞాపకాలు నెమరువేసుకుని..సందడిచేసిన వైనం

ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతికి స్వస్థలాలకు వచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుని..సందడిచేశారు. ఆనాటి గురువులను సన్మానించారు.

● **గరుగుబిల్లి:** మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986 నుంచి 1991లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. 33 సంవత్సరాల తర్వాత వారంతా కలుసుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది.అనంతరం అప్పట్లో బోధించిన గురు వులను సన్మానించారు. ● నాగూరులో విశ్రాంత ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, నఖ చిత్రకారులు, గేయ రచయిత, పలు అవా ర్డులు గ్రహీత పల్ల పరిశినాయుడు, ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నికైన కేతిరెడ్డి శిరీషను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా పరిశినా యుడు మాస్టారు రచించిన విరచిత నఖ చిత్రాయణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యా యుడు శీతంనా యుడు, దేవస్థానం ఛైర్మన్ కె.కూర్మినాయుడు, అచ్చుతరావు పాల్గొన్నారు.

●**పాలకొండ:** మండలంలోని ఎం.సింగుపురం జడ్పీ ఉన్నత పాఠశాల 1997-2002 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకొన్నారు. సహపంక్తి భోజనాలు చేశారు.



గరుగుబిల్లి: రావివలసలో గురువులతో కలిసిన పూర్వ విద్యార్థులు



పాలకొండ: ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు